
JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । సోమవారం 31-08-2026
Medchal - Malkajgiri । Monday 31-08-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 91
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 91 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com






# ఢిల్లీకి సీఎం..
# కీలక మార్పులు







- సురేఖ సహా ముగ్గురు ఔట్
- రాములమ్మ, మహేష్ గౌడ్ ఇన్- పీసీసీ చీఫ్, స్పీకర్ మార్పు..!?

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ కేబినెట్ ప్రక్షాళనకు రంగం సిద్ధమైంది. కొండా సురేఖ వివాదం వేళ పూర్తి స్థాయిలో మంత్రివర్గంలో మార్పుల దిశగా కసరత్తు జరుగుతోంది. ఇందుకు ముహూర్తం ఖరారైంది. అదే సమయంలో పీసీసీ చీఫ్, స్పీకర్ సైతం మారుతారని పార్టీ నేతల సమాచారం. ఈ ఇద్దరినీ రేవంత్ మంత్రివర్గంలోకి తీసుకోవాలని భావిస్తున్నారు. అదే విధంగా సురేఖతో పాటుగా మరో ఇద్దరు మంత్రుల పై వేటు పడనుందని తెలుస్తోంది. కొత్తగా మంత్రులు అయ్యే వారి పైనా ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. తెలంగాణ మంత్రివర్గంలో మార్పులు జరగనున్నాయి. సెప్టెంబరు 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఢిల్లీకి రావాల్సిందిగా అధిష్ఠానం సూచించింది. మూడో తేదీన జరగనున్న చర్చల్లో కొండా సురేఖ వ్యవహారంతోపాటు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కూడా కీలక నిర్ణయాల దిశగా కసరత్తు చేయనున్నారు. కొండా సురేఖ వివాదానికి సంబంధించి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నివేదిక ఇప్పటికే ఏఐసీసీకి చేరింది. దీంతో, ఢిల్లీ పర్యటన తరువాత మంత్రివర్గం ప్రక్షాళన ఉండటం ఖాయంగా కనిపిస్తోంది. సురేఖ తో గతంలో వివాదాస్పదంగా వ్యవహరించి.. సీఎం ఆగ్రహానికి గురైన మంత్రితో పాటుగా.. మరో మంత్రిపైనా వేటు ఖాయమని చెబుతున్నారు. వారి స్థానంలో ముగ్గురు కొత్తగా కేబినెట్ లో ఛాన్స్ దక్కనుంది. సురేఖ స్థానంలో ఎమ్మెల్సీ విజయ శాంతి పేరు ఖాయమైనట్లు సమాచారం. కాగా, సీఎం రేవంత్ కేబినెట్ లోకి విప్ ఆది శ్రీనివాస్ కు

...మిగతాది 2 లో

# చైనాకు చావు దెబ్బ
# దూసుకెళ్తున్న భారత్




- కర్మాగారాల విస్తరణ
- ప్రజల కొనుగోలు శక్తి పెరుగుదల

జయభేరి, న్యూఢిల్లీ:

ప్రపంచ తయారీ కేంద్రంగా పేరుగాంచిన చైనా వృద్ధి మందగిస్తుండగా, భారత పారిశ్రామిక రంగం దూసుకుపోతోంది. జులై నెలలో భారతదేశ పారిశ్రామిక ఉత్పత్తి 6.7% వృద్ధిని నమోదు చేయగా, చైనా వృద్ధి కేవలం 4.5% పరిమితమైంది. మూలధన వస్తువులు, ఆటోమొబైల్స్ రంగాలలో భారీ వృద్ధి నమోదు కావడం దేశ ఆర్థిక వ్యవస్థకు, ఉపాధి కల్పనకు శుభపరిణామమని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకప్పుడు ప్రపంచ తయారీ కేంద్రంగా ఒక వెలుగు వెలిగిన చైనా ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం మందగమనాన్ని ఎదుర్కొంటోంది. అదే సమయంలో భారతీయ కర్మాగారాలు పూర్తి వేగంతో పనిచేస్తూ చైనాను అధిగమిస్తున్నాయి. జులై నెల పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక సవాళ్లతో సతమతమవుతున్న తరుణంలో, భారత్ సాధిస్తున్న ఈ బలమైన పారిశ్రామిక పురోగతి దేశ ప్రజలకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోంది. చైనా కంటే భారత్ పారిశ్రామిక వేగం ఎందుకు ఎక్కువగా ఉందనేది తెలుసుకుందాం.
భారత్ vs చైనా...తాజా గణాంకాల ప్రకారం, జులై నెలలో భారతదేశ పారిశ్రామిక ఉత్పత్తి ఏకంగా 6.7% వృద్ధిని నమోదు చేసింది. ఇందులో ప్రధానంగా మూలధన వస్తువులు 16.1%, వినియోగ వస్తువులు 10.5% , ఆటోమొబైల్స్ రంగం 22.2% చొప్పున అద్భుతమైన వృద్ధిని సాధించాయి.

...మిగతాది 2 లో

# చాక్లెట్ల రూపంలో
# గంజాయి



- గుట్టు రట్టు చేసిన హైదరాబాద్ పోలీసులు

జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్‌లో గంజాయి దందా కొత్త రూపాలు దాలుస్తోంది. ఒకవైపు చాక్లెట్ల రూపంలో గంజాయిని విక్రయిస్తూ యువతను టార్గెట్ చేస్తున్న ముఠాలు.. మరోవైపు ఒడిషా నుంచి భారీగా గంజాయిని నగరానికి తరలించేందుకు ప్రయత్నిస్తున్నాయి. తాజాగా జరిగిన రెండు వేర్వేరు ఆపరేషన్లు.. హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని సాగుతున్న గంజాయి నెట్‌వర్క్ ఏ స్థాయిలో జరుగుతుందనేది నిర్ధారిస్తుంది. శామీర్‌పేట్‌లోని తూముకుంట చంద్రారెడ్డి కాలనీలో గంజాయి చాక్లెట్ల విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. పాన్ షాప్‌ను

...మిగతాది 2 లో



# డిసైడైన కొండా సురేఖ
# కీలక నిర్ణయం

- హైకమాండ్ నిర్ణయం ఎలా ఉన్నా.. మంత్రిగా విధుల్లో

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ ప్రభుత్వంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కొండా సురేఖ వివాదం కొత్త మలుపు తీసుకుంది. ఢిల్లీ కేంద్రంగా కీలక మంత్రాంగానికి ముహూర్తం ఖరారైంది. మంత్రివర్గ ప్రక్షాళనకు తుది కసరత్తు జరుగుతోంది. మంత్రి పదవిని


...మిగతాది 2 లో

# 1996 నాటి సంకల్పం..
# సాకారమవుతున్న స్వప్నం!

- వెలిగొండ పండుగ వద్ద కలుద్దాం: సీఎం చంద్రబాబు భావోద్వేగం
- చరిత్ర సృష్టించాలన్నా.. తిరగరాయాలన్నా చంద్రబాబే: మంత్రి గొట్టిపాటి

జయభేరి, విజయవాడ, ఆగస్టు 30 :

పశ్చిమ ప్రకాశంతో పాటు కరువు పీడిత ప్రాంతాల దశాబ్దాల కల నెరవేరే క్షణం రానే వచ్చింది. దాదాపు 30 ఏళ్లుగా కనుపాపల్లో దాచుకున్న వెలిగొండ ఆశయం.. ఇప్పుడు కృష్ణమ్మ పరవళ్లతో కళ్లముందు నిజమవుతోంది. నల్లమల కొండల గుండెలను చీల్చుకుంటూ దూసుకొస్తున్న జలాలు ఆ ప్రాంత ప్రజల నీటి కష్టాలను సమూలంగా తుడిచిపెట్టేందుకు సిద్ధమయ్యాయి. పక్షుల్లా వలస వెళ్లిన యువతకు సొంత నేలపైనే భవిష్యత్తును అందిస్తూ, కరువు భూముల్లో పసిడి పంటలు పండించేందుకు 'పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు' మొదటి దశ జాతికి అంకితం కావడానికి సర్వం సిద్ధమైంది. రేపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్న శుభవేళకు ముందు ఆదివారం చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. పెద్దదోర్నాల మండలం కొత్తూరు సమీపంలోని జంట సొరంగాల ద్వారా కృష్ణా జలాల ట్రయల్ రన్‌ను అధికారులు అత్యంత



విజయవంతంగా నిర్వహించారు. శ్రీశైలం జలాశయం కొల్లం వాగు వద్ద ఉన్న హెడ్ రెగ్యులేటర్ గేట్లను 3.3 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేయగా.. ఆ కృష్ణమ్మ జలాలు 18.8 కిలోమీటర్ల పొడవైన రాతి సొరంగ మార్గాన్ని దాటుకుంటూ మార్కాపురం జిల్లా గడ్డపైకి పరవళ్లతో అడుగు పెట్టాయి. కరువుతో నకనకలాడుతున్న ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించాలనే ఏకైక సంకల్పంతో 1996లో వేసిన

...మిగతాది 2 లో



# అలాంటి వారికే
# ఇందిరమ్మ ఇళ్లు

- గుడెసెలు లేని రాష్ట్రంగా మారుస్తాం
- మంత్రి కోమటిరెడ్డి కీలక ప్రకటన

జయభేరి, నల్గొండ జిల్లా :

ఇందిరమ్మ ఇళ్లను ఎట్టి పరిస్థితుల్లో ఆపమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. గుడిసె ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి గుడిసె లేని తెలంగాణగా మారుస్తామని అన్నారు. నల్గొండ జిల్లా తుంగతుర్తి

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## కీలక మార్పులు

అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. మహిళతో భర్తీ చేయాలంటే కేకే కుమార్తె విజయ లక్ష్మి పేరు వైపు మొగ్గు చూపుతున్నట్లుగా పార్టీలో ప్రచారం సాగుతోంది. అదే విధంగా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ను కేబినెట్ లోకి తీసుకొని.. ప్రస్తుత కేబినెట్ లో బీసీ మంత్రికి టీపీసీసీ పగ్గాలు ఇవ్వాలని భావిస్తున్నారు. అదే విధంగా స్పీకర్ ప్రసాద కుమార్ ను సైతం కేబినెట్ లోకి తీసుకుంటారని.. ఆయన స్థానంలో ఉమ్మడి కరీంనగర్ ఎస్సీ వర్గానికి చెందిన మంత్రిని స్పీకర్ గా చేస్తారని ప్రచారం సాగుతోంది. గ్రేటర్ ఎన్నికల వేళ హైదరాబాద్ పరిధి లోని నేతకు అవకాశం ఇవ్వాలనే చర్చ జరుగుతోంది. దీంతో.. ఢిల్లీ భేటీలో ఈ మొత్తం సమీకరణాల పైనా చర్చించి.. తుది రూపు ఇవ్వనున్నారు. అయితే.. కేబినెట్ ప్రక్షాళన మాత్రం వినాయక చవితికి ముందే జరగటం ఖాయమని తెలుస్తోంది.

## దూసుకెళ్తున్న భారత్

అంటే మన దేశంలోని కర్మాగారాలు కేవలం ప్రస్తుత అవసరాలకంటే ఉత్పత్తిని పెంచడమే కాకుండా, భవిష్యత్ సామర్థ్యాన్ని కూడా బలంగా నిర్మిస్తున్నాయి. మరోవైపు, ప్రపంచ కర్మాగారంగా పేరుగాంచిన చైనా పారిశ్రామిక ఉత్పత్తి కేవలం 4.5% మాత్రమే వృద్ధి చెందింది. అంటే భారతదేశ పారిశ్రామిక వృద్ధి రేటు చైనా కంటే దాదాపు ఒకటిన్నర రెట్లు ఎక్కువ. అంతేకాకుండా, భారత దేశ తయారీ రంగం 7.3% బలమైన వృద్ధిని నమోదు చేయగా, చైనా తయారీ రంగం 5.5% క్షీణతను చవిచూసింది. చైనా బలహీనమైన దేశీయ డిమాండ్, ఇతర ప్రతికూలతలను ఎదుర్కొంటున్న సమయంలో, భారత్ దూసుకెళ్లడం విశేషం. మన దేశంలో యంత్రాలు, వాహనాలు, విద్యుత్ పరికరాల ఉత్పత్తి వేగంగా పెరుగుతుండటం వల్ల ఇది నేరుగా ఉపాధి అవకాశాలపై ప్రభావం చూపుతోంది. మూలధన వస్తువుల ఉత్పత్తిలో 16.1% పెరుగుదల, అలాగే విద్యుత్ పరికరాల ఉత్పత్తిలో 28.3% వృద్ధి నమోదు కావడం చాలా పెద్ద మార్పు. దీని అర్థం కంపెనీలు కొత్త యంత్రాలను కొనుగోలు చేస్తూ, తమ కర్మాగారాలను భారీగా విస్తరిస్తున్నాయి. పారిశ్రామికవేత్తలకు భవిష్యత్తుపై గట్టి నమ్మకం ఉన్నప్పుడే ఇటువంటి మౌలిక సదుపాయాలపై భారీ పెట్టుబడులు పెడతారు. తయారీ, ఆటోమొబైల్ , యంత్రాల రంగాలు ఉపాధి కల్పనకు అతిపెద్ద చోదక శక్తులుగా ఉన్నాయి. ఈ రంగాలలో రాబోయే వృద్ధి, ఇంజినీరింగ్ , సాంకేతిక రంగాల నుండి పట్టభద్రులయ్యే యువతకు, నైపుణ్యం గల నిపుణులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుంది. వినియోగ వస్తువులైన టీవీలు, రిఫ్రిజిరేటర్లు , ఏసీల ఉత్పత్తిలో 10.5% పెరుగుదల నమోదు కావడం గమనించదగ్గ విషయం. ఇది ప్రజల ఆదాయాలు క్రమంగా పెరుగుతున్నాయని, వారు ఖర్చు చేయడానికి వెనుకాడటం లేదని సూచిస్తుంది. పెరుగుతున్న కార్పొరేట్ ఆదాయాలు భవిష్యత్తులో ఉద్యోగులకు మంచి అప్రైజల్స్, బోనస్‌లను అందించే అవకాశాలను కూడా పెంచుతాయి. ప్రపంచ కంపెనీలు తమ సరఫరా గొలుసుల కోసం చైనాకు ప్రత్యామ్నాయాలను వెతుకుతుండటం భారత్‌కు కలిసి వస్తోంది. ప్రభుత్వం రహదారులు, రైల్వేలు ఓడరేవులపై పెట్టిన భారీ పెట్టుబడుల కారణంగా నిర్మాణ సామగ్రి రంగం 6.9% వృద్ధి చెందింది. దీనివల్ల టైర్ 2, టైర్ 3 నగరాల్లో నేరుగా లక్షలాది ఉద్యోగాలు క్రియేట్ అవుతున్నాయి. మొత్తమ్మీద, భారత్ కేవలం ప్రపంచ అసెంబ్లీ లైన్‌గా మాత్రమే కాకుండా, ఒక బలమైన ప్రపంచ తయారీ కేంద్రంగా అవతరిస్తోందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## చాక్లెట్ల రూపంలో గంజాయి

తనిఖీ చేయగా.. ఏకంగా 5,298 గంజాయి చాక్లెట్లు బయటపడ్డాయి. దీంతో పాటు 25 కిలోల గంజాయిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బిహార్‌కు చెందిన బైద్నాద్, అతని భార్య పూజాకుమారి హైదరాబాద్‌కు వలసొచ్చి కొంతకాలంగా ఈ దందా నిర్వహిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. బిహార్ నుంచి గంజాయి చాక్లెట్లను తీసుకొచ్చి.. ఒక్కో ప్యాకెట్‌ను రూ.600కు విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది. దాడి సమయంలో బైద్నాద్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా.. అతని భార్య పూజాకుమారి పరారైంది. ఆమె కోసం గాలింపు కొనసాగుతోంది. మరోవైపు ఒడిషా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాపై ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్ చేపట్టింది. పంతంగి టోల్‌ప్లాజా సమీపంలో 20 కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకుంది. స్మగ్లింగ్‌పై సమాచారం అందుకున్న ఈగల్ ఫోర్స్ దాదాపు 18 గంటలకు పైగా నిఘా నిర్వహించింది. విశాఖపట్నం జిల్లా సబ్బవరం నుంచి ప్రారంభమైన ఆపరేషన్.. చౌటుప్పల్ వరకు కొనసాగింది. చివరకు గంజాయి తరలిస్తున్న త్రిలోచన్ సమంత్ర, సాగర్ బాలాను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని హైదరాబాద్‌కు చెందిన బికాష్ బారిక్ కోసం తీసుకొస్తున్నట్టు విచారణలో తేలింది. బికాష్ బారిక్‌పై ఇప్పటికే గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఎన్డీపీఎస్ కేసు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఇక ప్రధాన సప్లయిర్‌గా భావిస్తున్న త్రిలోచన్ సమంత్రపై ఒడిషాలో 7కి పైగా క్రిమినల్ కేసులు ఉన్నట్టు గుర్తించారు. ప్రస్తుతం పరారీలో ఉన్న బికాష్ బారిక్‌తో పాటు ఒడిషాకు చెందిన అమిత్ సాహ కోసం పోలీసులు గాలిస్తున్నారు. చాక్లెట్ల రూపంలో విక్రయాలు చేయడం నుంచి.. రాష్ట్రాల సరిహద్దులు దాటి భారీగా గంజాయి సరఫరా చేయడం వరకు ముఠాలు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నాయి. వరుస ఆపరేషన్లతో పోలీసులు, ఈగల్ ఫోర్స్ నెట్‌వర్క్‌లపై దాడులు చేస్తున్నప్పటికీ.. గంజాయి దందాను పూర్తిగా అడ్డుకోవడం సవాల్‌గా మారుతోంది. హైదరాబాద్‌లో ఈ ముఠాల మూలాలపై దర్యాప్తును పోలీసులు మరింత విస్తరించారు.

## అలాంటి వారికే ఇందిరమ్మ ఇళ్లు

నియోజకవర్గం నూతనకల్ మండల కేంద్రంలో శనివారం జరిగిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడిన ఆయన..భూమికి హక్కు ఉంటే రైతుకు ధైర్యం ఉంటుందని చెప్పారు. రైతులకు రైతు భరోసా, రైతుబంధు, బీమా, ఇతర లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లకు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ.5 లక్షలు ఇచ్చామని అన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.36 వేల కోట్లతో హ్యామ్ రోడ్లను నిర్మిస్తున్నామని చెప్పారు. తుంగతుర్తి నియోజకవర్గానికి రూ.100 కోట్లతో రోడ్లు మంజూరు చేశామన్నారు. మరో రూ.200 కోట్ల ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు డబుల్ రోడ్లను వేస్తామని చెప్పారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా చూస్తున్నామని.. సన్నబియ్యం, రైతు భరోసా, రైతుబంధు ఇస్తున్నామని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రజాపాలన అని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా పరిష్కారం కాని రైతుల సమస్యలు పట్టాల పంపిణీతో ఇప్పుడు పరిష్కారం అయ్యాయని చెప్పారు. తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత బస్సు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు.

ప్రజలు వీటన్నిటినీ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక శాసనసభ్యులు మందుల సామేలు మాట్లాడుతూ.. పొలాలను సాగు చేసుకుంటున్న రైతులకు హక్కులు లేనందువల్ల ఎన్నో బాధలకు గురయ్యారని అన్నారు. అలాంటి 60 సంవత్సరాల సమస్య తీర్చినందుకు రెవెన్యూ మంత్రికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని వ్యాఖ్యానించారు. భూ పట్టాల పంపిణీతో రైతులు వారి భూములకు హక్కుదారులు అయ్యారని చెప్పారు. గతంలో కేంద్రంలో ఉన్న తమ ప్రభుత్వం 25 లక్షల ఎకరాల భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత తమకే దక్కిందని చెప్పారు. దివంగత నేత, రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా హక్కు పత్రాలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. భూమి అనేది రైతుకు ఆత్మగౌరవమని, భూమి హక్కు లేకుంటే గుర్తింపు ఉండదని చెప్పారు.. తుంగతుర్తి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లను మంజూరు చేయాలని కోమటిరెడ్డిని ఎమ్మెల్యే సామేలు విజ్ఞప్తి చేశారు. తుంగతుర్తి నియోజకవర్గానికి అదనంగా ఇళ్లు మంజూరు చేయాలన్నారు.

---




## సంపాదకీయం



మోతె రఘు తిరుపతి రెడ్డి
ఎడిటర్, 'జయభేరి' దినపత్రిక

హైదరాబాద్ నగరం నడిబొడ్డున రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కేవలం రూ.87 కోట్లకే కట్టబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీశాయి. ఇవి కేవలం అధికార-ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధంగా కొట్టిపారేయదగినవి కావు. ప్రజలకు చెందిన అత్యంత విలువైన భూముల విషయంలో వచ్చిన ఆరోపణలు కాబట్టి ప్రభుత్వం పూర్తి వివరాలతో సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉంది. ప్రభుత్వ భూమి అంటే అధికారంలో ఉన్నవారి సొంత ఆస్తి కాదు. అది ప్రజల ఉమ్మడి సంపద. ఆ భూములను విక్రయించినా, లీజుకు ఇచ్చినా, ఇతర సంస్థలకు కేటాయించినా పారదర్శకత, మార్కెట్ విలువ, ప్రజాప్రయోజనం ప్రధాన ప్రమాణాలుగా ఉండాలి. రూ.500 కోట్ల విలువైన స్థలాన్ని రూ.87 కోట్లకే అప్పగిస్తున్నారన్న ఆరోపణ నిజమైతే, ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్లే. అది పరిపాలనా వైఫల్యంగా మాత్రమే కాకుండా ప్రజా సంపద దుర్వినియోగంగానూ పరిగణించాల్సి ఉంటుంది. అయితే ఆరోపణలు చేయడం ఎంత ముఖ్యమో, వాటికి ఆధారాలను ప్రజల ముందు ఉంచడం కూడా అంతే అవసరం. భూమి విస్తీర్ణం ఎంత? దాని అధికారిక మార్కెట్ విలువ ఎంత? ఎవరికి, ఏ విధానంలో కేటాయిస్తున్నారు? బహిరంగ వేలం నిర్వహించారా? స్వతంత్ర సంస్థతో విలువ మదింపు చేయించారా? మంత్రివర్గ ఆమోదం ఉందా? ఈ ప్రశ్నలన్నింటికీ ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి. సంబంధిత జీవోలు, టెండర్ పత్రాలు, భూ విలువ నిర్ధారణ నివేదికలను బహిర్గతం చేయాలి. మౌనం పాటించడం లేదా రాజకీయ విమర్శలతో ఎదురుదాడి చేయడం అనుమానాలను మరింత పెంచుతుంది.

**50 వేల ఎకరాలపై కుటుంబాల ఆందోళన**

మరోవైపు, సుమారు 50 వేల ఎకరాల ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చారన్న ఆరోపణ మరింత తీవ్రమైనది. ఏళ్ల తరబడి కష్టపడి కొనుగోలు చేసిన భూములు ఒక్కసారిగా నిషేధిత ఆస్తులుగా మారితే సామాన్య కుటుంబాల పరిస్థితి ఏమిటి? ఆస్తులను అమ్ముకోలేరు, రిజిస్ట్రేషన్ చేయించుకోలేరు, బ్యాంకు రుణాలు పొందలేరు. పిల్లల చదువులు, వివాహాలు, వైద్య అవసరాల కోసం తమ సొంత ఆస్తినే ఉపయోగించుకోలేని దుస్థితి ఏర్పడుతుంది.

ప్రభుత్వ భూముల పరిరక్షణ అవసరమే. అక్రమ రిజిస్ట్రేషన్లు, కబ్జాలు, నకిలీ పత్రాలను అరికట్టాల్సిందే. కానీ ఆ పేరుతో చట్టబద్ధమైన పత్రాలు కలిగిన వేలాది మంది ప్రజలను శిక్షించడం న్యాయం కాదు. సమగ్ర పరిశీలన లేకుండా ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చడం పరిపాలనా సౌలభ్యం కావచ్చు; కానీ బాధిత కుటుంబాలకు అది జీవితకాల శిక్షగా మారుతుంది.

ప్రతి సర్వే నంబరును విడివిడిగా పరిశీలించి, ప్రభుత్వ భూమి ఏది, ప్రైవేటు పట్టా భూమి ఏది, వివాదాస్పద భూమి ఏదో స్పష్టంగా తేల్చాలి. అభ్యంతరాలు తెలిపేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి. నిర్ణీత గడువులో దరఖాస్తులను పరిష్కరించాలి. చట్టబద్ధమైన యాజమాన్య పత్రాలు ఉన్న ఆస్తులను వెంటనే నిషేధిత జాబితా నుంచి తొలగించాలి.


**విచారణతోనే విశ్వసనీయత**

ప్రజా సంపద విషయంలో అధికారంలో ఎవరు ఉన్నా ఒకే ప్రమాణం వర్తించాలి. గత ప్రభుత్వంపై ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనలో మరింత పారదర్శకతను ప్రదర్శించాలి. హరీశ్‌రావు చేసిన భూ కుంభకోణ ఆరోపణలపై స్వతంత్ర సంస్థ లేదా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తితో విచారణ జరిపించడం ఉత్తమ మార్గం. ఆరోపణలు అసత్యమైతే విచారణలో అదే తేలుతుంది. నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం వెంటనే సంబంధిత భూమి కేటాయింపు ప్రక్రియను నిలిపివేసి, పూర్తి పత్రాలను ప్రజల ముందుంచాలి. నిషేధిత ఆస్తుల జాబితాపై జిల్లాలవారీగా ప్రత్యేక సమీక్ష నిర్వహించాలి. బాధితుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే ప్రజా ఉద్యమాలు తప్పవన్న హరీశ్‌రావు హెచ్చరిక రాజకీయ ప్రకటనగానే మిగలకపోవచ్చు.

ప్రజల భూములను కాపాడాల్సిన ప్రభుత్వమే అనుమానాలకు తావిచ్చే నిర్ణయాలు తీసుకుంటే ప్రజాస్వామ్యంపై విశ్వాసం దెబ్బతింటుంది. అధికార పక్షం వివరణ ఇవ్వాలి; ప్రతిపక్షం ఆధారాలు బయటపెట్టాలి; నిజానిజాలను స్వతంత్ర విచారణ తేల్చాలి. ఎందుకంటే ఇది కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య రాజకీయ పోరాటం మాత్రమే కాదు...ప్రజల కష్టార్జితం, ప్రభుత్వ ఖజానా, తెలంగాణ భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న!

---

# నేను మతపరమైన పండితుడ్ని కాదు



న్యూయార్క్ 'One World: One Humanity Faith Leaders' Summit' లో మోహన్ భాగవత్ మాట్లాడిన ముఖ్యాంశాలు

జయభేరి, న్యూయార్క్ :

న్యూయార్క్ వేదికగా జరిగిన World Council of Religions అన్న వేదికగా ఆరెస్సెస్ సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్ కీలకమైన ప్రసంగం చేశారు. ఏకత్వం, వివిధ మతాల మధ్య సామరస్యం అన్న అంశంపై అత్యంత శక్తిమంతమైన ప్రసంగం చేశారు. వివిధ సంస్కృతులలో మతపరమైన ఆచారాలు, సంప్రదాయాలు వేరుగా వుండొచ్చు కానీ, మానవుల అస్తిత్వం మాత్రం ప్రాథమికంగా ఒక్కటేనని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగంలోని కీలకాంశాలివీ...

1. నేను మతపరమైన పండితుడ్ని కాదు. మత పెద్దను కూడా కాదు. మతాలు వేరైనప్పటికీ మానవత్వం ఒక్కటే అయిన సమాజంలో మనం జీవిస్తున్నాం. 2.అనేక మతాలు ఉన్నాయి. నేటి ప్రపంచంలో మతపరమైన కార్యకలాపాలు ఎక్కువగా ఆచారాల ద్వారానే నిర్వచించబడుతున్నాయి; అయితే, ఆ ఆచారాలను పాటించడంలో క్రమశిక్షణ కూడా అవసరం. 3. భారతదేశంలో అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. సంప్రదాయం ప్రకారం, భారతదేశం అందరికీ ఆశ్రయం కల్పించింది. ప్రపంచంలో ఎక్కడా సురక్షితమైన స్థలం దొరకని వారు భారతదేశానికి వచ్చి, ఇక్కడ తమకంటూ ఒక స్థానాన్ని ఏర్పర్చుకున్నారు.

4. ప్రపంచ మానవాళి అంతా ఒక్కటే అనే జ్ఞానం సంఘ్ కి వున్నందున, వైవిధ్యాలు ఉన్నప్పటికీ మనమంతా ఒక్కటే అని ప్రపంచవ్యాప్తంగా అందరికీ తెలియజేయడం తమ కర్తవ్యమని ఆర్ఎస్ఎస్ (RSS) భావిస్తోంది. 5. ముస్లిం సోదరులు నన్ను ఒక ప్రశ్న అడిగారు: "మీరు ఒక హిందూ సంస్థ, 'హిందూ రాష్ట్రం' గురించి మాట్లాడుతుంటారు; మరి మా ముస్లింల పరిస్థితి ఏమిటి? మమ్మల్ని వెళ్ళగొడతారా?" దానికి నేను ఇలా సమాధానం ఇచ్చాను: "లేదు, అది హిందుత్వ కాదు. భారత్‌లో ముస్లింలు ఉండకూడదని ఏ హిందువైనా భావిస్తే, అతను హిందువుగా కొనసాగలేడు."

6. ఎక్కడైతే "నేను", "నాది" ఉంటాయో, అక్కడ పరిష్కారం ఉండదు. "మేము", "మాది" అనేదే పరిష్కారం.

7.మేము (RSS) సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సేవ చేసేటప్పుడు మేము ఎటువంటి వివక్ష చూపం; ఎవరికి అవసరమున్నా వారికి సేవ చేస్తాం. సమాజ సహకారంతో మా స్వయంసేవకులు లక్షా ముప్పై వేల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వారు అన్ని చోట్లా, అందరికీ సమానంగా సేవలు అందించారు. 8.భారతదేశంలోని హర్యానా రాష్ట్రం, దాద్రీ వద్ద రెండు విమానాలు ఢీకొన్నాయి. ఆ రెండు విమానాలు ముస్లిం దేశాలకు చెందినవి; అందులోని ప్రయాణికులలో ఎక్కువమంది ముస్లింలే ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే మా స్వయంసేవకులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. దురదృష్టవశాత్తు ప్రయాణికులందరూ మరణించారు. మా స్వయంసేవకులు వారి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు, అలాగే మృతుల బంధువులు వచ్చినప్పుడు వారిని గుర్తించడంలో సహాయపడ్డారు. వారు ముస్లింలన్న భావన మాకు లేదు. 9. ప్రతి సమాజంలోనూ దాని సంప్రదాయాలలో జ్ఞానం ఉంటుంది. ఇందులో మానవుల గురించిన జ్ఞానం, ప్రేమ గురించిన జ్ఞానం, మానవ ప్రవర్తనా నియమాలు ఉంటాయి. మానవ ఐక్యతే భారతదేశపు సాంప్రదాయ ఆలోచన, మరియు మన నాయకులందరూ దీనిని నొక్కి చెప్పారు. మన రాజ్యాంగం కూడా దీనినే నొక్కి చెబుతుంది.10. కేవలం రాజకీయాల ద్వారానే పనులు సాధించలేము. చెప్పడానికి బాధగా ఉన్నా, వాస్తవం ఏమిటంటే రాజకీయాలు ఇప్పుడు స్వప్రయోజనాల ఆటగా మారిపోయాయి. సమాజం నుండే ప్రారంభించాలన్నది భారత్‌లో మా అనుభవం; మేము దానిని ఇప్పటికే ప్రారంభించాము. 11.మనం సమాజంలోనూ, స్థానిక స్థాయిలోనూ క్రియాశీలకంగా వ్యవహరించాలి. నిస్వార్థ సేవా కేంద్రాలను మరియు ఐక్యతా భావంతో కూడిన వాతావరణాన్ని మనం సృష్టించాలి. సంభాషణలు కొనసాగాలి; ఆ సంభాషణల ద్వారా మనం ప్రజలను అనుసంధానించాలి. తద్వారా మనం విస్తరించాలి. ప్రజలు దీనిని చూసి, అనుభవించినప్పుడు వారిలో మార్పు వస్తుంది. మనం కోరుకునే ప్రపంచం యొక్క నమూనాను మన సొంత ప్రాంతంలోనే మనం సృష్టించాలి.

12. మేము 2018 తర్వాత, ప్రధానంగా భారతదేశంలోని ముస్లింలు మరియు క్రైస్తవులతో సంభాషణను ప్రారంభించాము. సంభాషణ అనేది మొదటి అడుగు, మరియు సేవ అనేది మరొక అడుగు.

13.నాకు మధుమేహం ఉంది, కాబట్టి నాకు చక్కెర నిషిద్ధం. కానీ ఎప్పుడైనా స్వీట్లు కనిపిస్తే, వాటిని తినడానికి ఏదో ఒక సాకు వెతుక్కుంటాను. అలాగే, ఏవి సరైనవో, ఎవరు సరైనవారో (ధార్మిక వ్యక్తులు) ప్రజలకు తెలుసు; అయినప్పటికీ, తమ స్వల్పకాలిక ఇష్టాయిష్టాల కారణంగా వారు ఆ సరైన మార్గాన్ని కాదని వేరే దారిని ఎంచుకుంటారు. 14. మన సంప్రదాయంలో స్వామి వివేకానందుని గురువైన రామకృష్ణ పరమహంస ఉన్నారు. ఆయన వివిధ మతాలను ఆచరించారు. భారతీయ మతాలతో పాటు ఇస్లాం మరియు క్రైస్తవ మతాలను కూడా ఆయన అనుసరించారు. ఆయా మార్గాలన్నింటినీ అనుభవపూర్వకంగా తెలుసుకున్న తర్వాత ఆయన ఇలా అన్నారు: "చింతించకండి. ఎన్ని మార్గాలు ఉంటే అన్ని ఆలోచనలు ఉంటాయి; అవన్నీ చివరికి ఒకే మార్గానికి దారితీస్తాయి."

15. అలహాబాద్ విశ్వవిద్యాలయంలోని తత్వశాస్త్ర విభాగ అధిపతిగా పనిచేసిన గురుదేవ్ శ్రీ రనడే అనే మరొక వ్యక్తి ఉన్నారు. ఆయన వివిధ సంప్రదాయాలకు చెందిన ఆధ్యాత్మిక అనుభవాలను అధ్యయనం చేశారు. వివిధ మార్గాల ద్వారా ప్రజలకు కలిగే అనుభవాల గురించి ఆయన మనకు వివరిస్తారు; ఆ అనుభవాలు ఒకేలా ఉంటాయి. అటువంటి అనుభవాలు లిఖితపూర్వకంగా నమోదు చేయబడి ఉన్నాయి, ఆయన వాటన్నింటినీ అధ్యయనం చేశారు.

---

## సాకారమవుతున్న స్వప్నం!

పునాది రాయి ఇప్పుడు మహా ఫలంగా మారింది. తొలి దశ ప్రారంభం ద్వారా ఏకంగా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా, ఫ్లోరైడ్ రహిత పరిశుభ్రమైన తాగునీరు 4 లక్షల మంది ప్రజల దాహార్తిని తీర్చనుంది. ఈ నీటి పండుగ వెనుక తమ సొంత ఇళ్లను, పచ్చని పొలాలను, పుట్టి పెరిగిన ఊళ్లను త్యాగం చేసిన 11 ముంపు గ్రామాల నిర్వాసితుల త్యాగం అమూల్యమైనది. వారి త్యాగాల పునాదులపైనే ఈ రోజే ప్రగతి బాట నిర్మితమైంది.

**వెలిగొండ పండుగ వద్ద కలుద్దాం: సీఎం చంద్రబాబు భావోద్వేగం**

ఈ చారిత్రక సందర్భంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందిస్తూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. వెలిగొండ అనేది కేవలం రాళ్లు, కాంక్రీటుతో కట్టిన ప్రాజెక్టు మాత్రమే కాదని.. అది రైతన్నకు ఇచ్చే కొండంత భరోసా అని, ఫ్లోరైడ్ పీడితులకు దక్కే ఆరోగ్య రక్షణ అని పేర్కొన్నారు. కరువుపై జరిపిన సుదీర్ఘ పోరాటానికి లభించిన విజయమని సంతోషం వ్యక్తం చేశారు. "రేపటి నుంచి మొదలయ్యే వెలిగొండ జలసిరులు ఈ ప్రాంత అభివృద్ధికి అసలైన రెక్కలు.. మన మందరం కలిసి ఈ వెలిగొండ పండుగను జరుపుకుందాం" అంటూ ప్రజలందరికీ పిలుపునిచ్చారు.

**చరిత్ర సృష్టించాలన్నా.. తిరగరాయాలన్నా చంద్రబాబే: మంత్రి గొట్టిపాటి**

అభివృద్ధిలో చరిత్ర సృష్టించాలన్నా.. గత చరిత్రను తిరగరాయాలన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే సాధ్యమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వెనుకబడిన మార్కాపురం ప్రాంతాన్ని జిల్లాగా ఏర్పాటు చేయడంతో పాటు హార్టికల్చర్ హబ్‌లో చేర్చడం, వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రారంభించే స్థాయికి తీసుకురావడం చంద్రబాబు నాయుడు నాయకత్వం లోనే సాధ్యమైందని పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా ప్రజలు మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారం కానుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరగనుందని చెప్పారు. ఈ ప్రాంత ప్రజలకు ఇది ఒక చారిత్రక ఘట్టమని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుకు నికర జలాలు సాధించేందుకు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఢిల్లీ వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రాంతీయ ప్రజల ప్రయోజనాల కోసం అప్పట్లో చేసిన పోరాటం ఫలించిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల నిర్వహణను సైతం పట్టించుకోలేదని విమర్శించారు. జగన్ రెడ్డి ప్రభుత్వ కాలంలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిందని, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ, గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు దెబ్బతిన్నాయని ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్వహణపై నిర్లక్ష్యం వహించిన వైసీపీ నేతలకు వెలిగొండ ప్రాజెక్టు గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు.

## డిసైడైన కొండా సురేఖ కీలక నిర్ణయం

తప్పించటం ఖాయమని ప్రచారం సాగుతున్న వేళ కొండా సురేఖ కీలక నిర్ణయం తీసుకున్నారు. తన శాఖ అధికారులకు దీనికి అనుగుణంగా ఆదేశాలు ఇచ్చారు. తెలంగాణ కేబినెట్ లో కొద్ది రోజులుగా కొండా సురేఖ వ్యవహారం సంచలనంగా మారింది. సీఎం రేవంత్ పై సురేఖ కుమార్తె చేసిన కామెంట్స్ తో మొదలైన వ్యవహారం ఢిల్లీకి చేరింది. ఈ వారంలో నే సీఎం రేవంత్ ఢిల్లీలో హైకమాండ్ తో భేటీ కానున్నారు. ఆ సమయంలో సురేఖ పైన నిర్ణయం వెలువడే అవకాశం కనిపిస్తోంది. కాగా.. ఈ వివాదం తరువాత ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా మౌనంగా ఉంటున్న కొండా సురేఖ ఈ రోజు తిరిగి తన విధుల పైన ఫోకస్ చేసారు. గోదావరి పుష్క రాల పైన సమీక్ష చేసారు. తెలంగాణలో గోదావరి పుష్కరాలను ఈసారి ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. గోదావరి పుష్కరాలు అంటే ఇప్పటివరకు రాజమండ్రి మాత్రమే గుర్తొచ్చేదని, ఇకపై తెలంగాణలోనూ పుష్కరాలను గ్రాండ్‌గా నిర్వహించేలా చర్యలు చేపడుతునట్లు వెల్లడించారు.

హైకమాండ్ నిర్ణయం ఎలా ఉన్నా.. మంత్రిగా విధుల్లో

పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని కొండా సురేఖ చెప్పారు. ఈ ఏర్పాట్లలో భాగంగా పుష్కరాల స్పెషల్ ఆఫీసర్ కార్యాలయాన్ని ప్రజాభవన్‌లో ప్రారంభించారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారుల ను ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు. గోదావరి నది వెంట బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని వెల్లడించారు. పుష్కరా లకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆయా ప్రాంతాల్లోని దేవాలయాల ను అభివృద్ధి చేసేలా పనులు చేపడుతున్నామని చెప్పారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పుష్కరాల పనులు ప్రారంభమయ్యాయని, మరికొన్ని పనులు టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. ముఖ్యమంత్రి డైరెక్షన్‌లో అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. దీని ద్వారా హైకమాండ్ నిర్ణయం ఎలా ఉన్నా.. అప్పటి వరకు తన విధుల్లో తాను కొనసాగాలని కొండా సురేఖ డిసైడైనట్లు స్పష్టం అవుతోంది.

# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- వ్యవసాయాన్ని కాపాడాలి: సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్
- రెండో రోజు కొనసాగిన సీపీఎం పాదయాత్రకు మేడ్చల్ నాయకుల ఘన స్వాగతం

**జయభేరి, మేడిపల్లి :**

యాదాద్రి భువనగిరి జిల్లా ఏర్పడి దశాబ్ద కాలం పూర్తవుతున్నా సాగు, తాగునీటి ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులకు తక్షణమే నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన గడువు ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అసంపూర్తి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలనే డిమాండ్‌తో సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ చేపట్టిన పాదయాత్ర రెండో రోజు ఘట్కేసర్, మేడిపల్లి మీదుగా ఉప్పల్‌కు చేరుకుంది. బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో జహంగీర్ మాట్లాడారు. వ్యవసాయాధారిత యాదాద్రి భువనగిరి జిల్లాలో సాగునీటి వసతులు లేక లక్షలాది మంది చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బునాదిగాని, ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వల పనులకు నిధులు కేటాయించకపోవడంతో అవి మధ్యలోనే నిలిచిపోయాయని తెలిపారు. బస్వాపూర్, గంధమల్ల, చర్లగూడెం వంటి బహుళార్థసాధక ప్రాజెక్టులు నిధుల కొరతతో పెండింగ్‌లో ఉండటం వల్ల జిల్లాకు సాగు, తాగునీటి సమస్యలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నవాబుపేట రిజర్వాయర్ నుంచి గుండాల మండలానికి, అశ్వరాయిపల్లి నుంచి ఆలేరు ప్రాంతానికి నీరందించేందుకు నిర్మించిన కాల్వల్లో 15 ఏళ్లకు పైగా నీరు ప్రవహించక గడ్డి మొలిచి శిథిలావస్థకు చేరాయని అన్నారు. నారాయణపురం, చౌటుప్పల్ ప్రాంతాలకు కీలకమైన రాచకొండ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఎందుకు ముందుకు సాగడం లేదో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆసిఫ్‌నగర్, బృందావనం కాల్వలను పునరుద్ధరించాలని కోరారు.






**మూసి ప్రక్షాళనకు గోదావరి జలాలే పరిష్కారం**

మూసి సుందరీకరణ పేరుతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు కార్పొరేట్ లాభాలకే పరిమితమవుతున్నాయా అన్న అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని జహంగీర్ అన్నారు. భువనగిరి ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని విషపూరిత మూసి నీరు ప్రభావితం చేస్తోందని వారికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.
మూసి పరివాహక ప్రాంతానికి గోదావరి జలాలు అందించడం ద్వారానే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని పేర్కొన్నారు. మూసి ప్రక్షాళనతో పాటు గోదావరి జలాల అనుసంధానానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లాలోని షామీర్‌పేట్ చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసి, అక్కడి నుంచి యాదాద్రి భువనగిరి ప్రాంతానికి గోదావరి జలాలు అందించే ప్రతిపాదనను అమలు చేయాలని కోరారు. పాదయాత్రకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ, ఘట్కేసర్ మండల కమిటీ, మేడిపల్లి మండల కమిటీ నాయకులు ఘన స్వాగతం పలికారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి వేలాది మంది రైతులు పాదయాత్రకు సంఘీభావంగా తరలివస్తారని జహంగీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అవనగంటి వెంకటేష్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గడ్డం వెంకటేశ్, వనం ఉపేందర్ లు పాల్గొన్నారు. పాదయాత్ర బృందానికి స్వాగతం పలికిన వారిలో సీపీఎం మేడ్చల్ జిల్లా నాయకులు చింతల యాదయ్య, ఘటకేసర్ నాయకురాలు సబితా, మేడిపల్లి మండల కార్యదర్శి ఎన్.సృజన, కర్రె జంగయ్య, కుమార్, అంజయ్య గౌడ్, పాపయ్య, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.



## త్రిషల్ బాక్స్ క్రికెట్ ను ప్రారంభించిన మాజీ మేయర్

**జయభేరి, మేడిపల్లి :**

మల్కాజ్గిరి కార్పొరేషన్ బోడుప్పల్ పరిధిలోఆదివారం రోజున త్రిషల్ బాక్స్ క్రికెట్ ను నిర్వాహకులు వంశీ కృష్ణ ధీరజ్ కృష్ణ ల తోకలిసి బోడుప్పల్ మాజీ మేయర్ అజయ్ యాదవ్ ప్రారంభించారుఅనంతరం అజయ్ యాదవ్ మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసం ను ఇస్తాయి కావున ప్రతిఒక్కరు ప్రతిరోజు ఒక గంట ఫిజికల్ ఫిటినెస్ పైన శ్రద్ధ చూపాలి అని కోరారు ఈ కార్యక్రమంలోమాజీ డిప్యూటీ మేయర్ కొత్త కిషోర్ గౌడ్ 11డివిజన్ మరియు 12డివిజన్ అధ్యక్షులతో పాటు ప్రముఖ పారిశ్రమిక వేత్త బేజాడి బ్రమ్మం తదితరులు పాల్గొన్నారు.

## తీదేడు ముత్యాలమ్మ ఆశీస్సులు ప్రతి ఒక్కరూ పొందాలి

- రమావత్ రవీంద్ర కుమార్, దేవరకొండ మాజీ శాసనసభ్యులు



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం తీదేడు ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరూ పొందాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆకాంక్షించారు.చింతపల్లి మండలం. తీదేడు గ్రామంలో తిరుమణి పాపయ్య నిర్వహించిన ముత్యాలమ్మ అమ్మవారి జాతర/ఉత్సవాల్లో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ముత్యాలమ్మ అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఐక్యంగా, భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఉత్సవాలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. గ్రామ ప్రజలకు, భక్తులకు ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, కేతావత్ బిల్య నాయక్, స్థానిక సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి ,దేన్యతండ గ్రామ సర్పంచ్ రమావత్ కొండల్ నాయక్, తులసి రాం, బాలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మద్రు రామారావు, ఉలుపాల పురుషోత్తం రెడ్డి, సిమర్ల శ్రీను యాదవ్, దండేటికార్ ప్రసాద్, కాయితి బచ్చిరెడ్డి, మద్రు శ్రీనివాస రావు,మద్రు సురెందర్ రావు, శివర్ల పర్వతాలు యాదవ్, దాసరి తిరుపతయ్య, తిరుమణి వెంకటయ్య, దాసరి ముత్తయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు సంవృద్ధిగా కురువాలని పాండవుల బండ వద్ద ప్రత్యేక పూజలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం ఉమ్మడి మైనంపల్లి గ్రామపంచాయతీ గ్రామ ప్రజలు వర్షాలు సంవృద్ధిగా కురువాలని రైతులు బాగుపడలని నేడు మైనంపల్లి వద్ద పాండవుల బండ వద్ద ఉన్న పంచ పాండవులను పూజ చేసి గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు అనంతరం బండ దగ్గర వరద పాశం పోశారు. ఈ కార్యక్రమంలో మైనంపల్లి సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ ,శకృతండా సర్పంచ్ మోహన్ లాల్ నాయక్,అంబటి వాని గూడెం సర్పంచ్ హరికృష్ణ, ఉప సర్పంచులు లాలూ నాయక్ సోంల ,మాజీ ఎంపీటీసీ సీత్య,మాజీ సర్పంచ్ అంజయ్య, మాజీ ఉప సర్పంచ్ వెంకటయ్య ,వార్డు సభ్యులు కొర్ర కిషన్,పులిజల నాగరాజు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఓటరు జాబితాతో మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు

**జయభేరి, ఆల్విన్ కాలనీ :**

SIR సర్వే కార్యక్రమంలో భాగంగా 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు అందిస్తూ దత్తాత్రయ కాలనీ లోని సాయిబాబా టెంపుల్ లో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్‌మ్యాపింగ్ కేటగిరీల్లో ఉన్న ఓటర్లకు బీఎల్‌వోలు నోటీసులు అందించి, వివరాలను యాప్‌లో నమోదు చేస్తారని అన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు వారికి సంబంధించిన ధ్రువపత్రాలతో హాజరై మ్యాపింగ్ పక్రియ పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఆన్లైన్ ద్వారా కూడా వారికి ఇచ్చిన నోటీసులో పేర్కొన్న పత్రాలు అప్లోడ్ చేసే అవకాశం ఉందని తెలియజేశారు. నోటీసు వచ్చినంత మాత్రాన ఓటు తొలగదని, అర్హులైన ఓటర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించబోమని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, నిరంజన్, సి.ఓ ముస్తఫా, బి.ఎల్.ఓలు, బి.ఎల్.ఎలు తదితరులు పాల్గొన్నారు.



## పొలం గట్టున డిప్యూటీ సీఎం..

- కూలీలతో ఆత్మీయ పలకరింపు..

**జయభేరి, ఖమ్మం జిల్లా :**

నిత్యం బిజి గా ఉండే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..పొలం గట్ల పై ప్రత్యక్ష మయ్యారు. ఇవాళ ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా రోజంతా పొలంలో చెమటోడ్చి పనిచేసిన ఆ శ్రమజీవులకు, ఆదివారం ఓ మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రాయన్నపేట శివారుల్లో తన కాన్వాయ్ ఆపి పొలాల్లోకి వెళ్ళారు. నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. హంగూ ఆర్భాటాలకు దూరంగా, నేరుగా పంట పొలాల్లో కూలీ పనులు చేస్తున్న మహిళల వద్దకు వెళ్లారు. మధ్యాహ్న భోజనానికి సిద్ధమవుతూ క్యారేజీలు విప్పుకుంటున్న ఆడబిడ్డల మధ్యకు ఆయన హోదాను పక్కన పెట్టి.. వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మీ ఇళ్లకు అందుతున్నాయా తల్లులారా?" అంటూ ఆప్యాయంగా పలకరించారు. అధికారపు హంగులు, ఆర్భాటాలు లేకుండా వారితో ఆత్మీయత మాట్లాడారు. భట్టి విక్రమార్కను తమ మధ్య చూసిన ఆ మహిళ కూలీలు సంతోష పడ్డారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం తమ జీవితాల్లో వచ్చిన మార్పులను చెబుతూ వారు భావోద్వేగానికి లోనయ్యారు. ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యంతోనే ఇంట్లో సంతోషంగా అన్నం వండుకుని తింటున్నాం.. మా పిల్లపాపలు కడుపునిండా అదే అన్నం తింటున్నారు" అని చెప్పినప్పుడు వారి మాటల్లో కనిపించిన తృప్తి.. సంక్షేమ పథకాల అసలైన అర్థాన్ని కళ్లముందు నిలిపింది. కరెంటు బిల్లుల గురించి అడిగినప్పుడు.. "మాకు రూపాయి బిల్లు కూడా రావడం లేదు సార్.. ప్రభుత్వమే ఉచితంగా ఇస్తోంది" అని వారు చెప్పిన మాటల్లో.. ఎన్నాళ్లుగానో మోస్తున్న ఆర్థిక భారాన్ని దించుకున్న నిశ్చింత స్పష్టంగా కనిపించింది. ఇటీవల హైదరాబాద్‌కు కూలీ పనుల కోసం వెళ్లిన సందర్భాన్ని గుర్తుచేసుకున్న ఆ మహిళలు.. ఉచిత బస్సు ప్రయాణం తమకు ఎంతగానో ఉపయోగపడిందని ఆనందంగా చెప్పారు. ప్రయాణ ఛార్జీల కోసం ఖర్చయ్యే డబ్బు మిగలడం.. తమ కుటుంబ అవసరాలకు ఎంతో ఆసరాగా మారిందని కృతజ్ఞతతో తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మీరు ఉచితంగా పొందుతున్న ప్రతి పథకానికి మీ తరపున ఆర్థిక శాఖ ఆయా శాఖలకు క్రమం తప్పకుండా నిధులు చెల్లిస్తోంది. ప్రజల అవసరాలను గుర్తించడం.. ఆ అవసరాలను తీర్చడం.. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ఈ ప్రజాప్రభుత్వం అసలైన బాధ్యతని చెప్పారు.



## స్థానిక పత్రికలతోనే సమాజ నిర్మాణం

- వ్యక్తులతో కూడిన కుటుంబమే దేశానికి వెన్నెముక.. భరత్ కుమార్
- స్థానిక పత్రికలకు ఉన్న శక్తి ప్రధాన స్రవంతిలోని జాతీయ మీడియాకు కూడా లేద.. జీ. వల్లీశ్వర్

**జయభేరి, హైదరాబాద్:**



ప్రపంచానికి దిశానిర్దేశం చేసేలా భారత్‌ను విశ్వగురువుగా మలిచేందుకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) ప్రతిపాదించిన పంచపరివర్తన కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళి ఉత్తమ భారతీయ సమాజాన్ని రూపొందించుకోవలసిన అవసరం ఉందని సంఘ్ క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ పేర్కొన్నారు. భాగ్యనగర్‌లోని స్టాన్లీ ఇంజనీరింగ్ కాలేజీలో "సమాచార భారతి" సంస్థ ఆధ్వర్యంలో ''స్థానిక పత్రికలు సమాజ నిర్మాణం'' అంశంపై ఆదివారం జరిగిన ఇష్టాగోష్ఠి కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు. సంఘ్ క్షేత్ర ప్రచార ప్రముఖ్ నడింపల్లి ఆయుష్ ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో తెలంగాణలోని పలు జిల్లాల నుంచి 30కి పైగా వివిధ స్థానిక పత్రికల సంపాదకులు, పాత్రికేయులు పాల్గొని విశేష స్పందన కనబరిచారు.
సంఘం ప్రధానంగా మార్పును, పరిణామాన్ని కోరుతున్నదని, ఇవి వ్యక్తి నుంచి ప్రారంభం కావాలని, దేశ నిర్మాణం లక్ష్యంగా ఇటువంటి వ్యక్తి నిర్మాణం అనేది సంఘ్ శాఖలలో జరుగుతున్నదని భరత్ కుమార్ వివరించారు. ఇలాంటి వ్యక్తులతో కూడిన కుటుంబమే దేశానికి వెన్నెముక అన్నారు. సంఘ్ ప్రస్తుతం 90 వేలకు పైగా శాఖలు, లక్షా 50 వేలకు పైగా వివిధ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ భారతీయ సంస్కృతి విలువలను చాటి చెబుతోందన్నారు. ఆధునీకరణ అంటే పాశ్చాత్యీకరణ కాదంటూ మన దేశం పరమ వైభవ స్థితిని అందుకునేందుకు అనుసరించాల్సిన విలువలను తెలియజేశారు.
సమాచార భారతి ఉపాధ్యక్షులు జీ. వల్లీశ్వర్ మాట్లాడుతూ.. స్థానిక పత్రికల ప్రాధాన్యతను వివరించారు. స్థానిక పత్రికలకు ఉన్న శక్తి ప్రధాన స్రవంతిలోని జాతీయ మీడియాకు కూడా లేదని స్పష్టం చేశారు. ఏ ప్రాంత ప్రజలైనా ముందుగా తమ ఊరిలో, తాముంటున్న చోట ఏం జరుగుతోందనే సమాచారం తెలుసుకోవడానికి ఆసక్తిని కనబరుస్తారని, వీరిని ప్రభావితం చేసే శక్తి స్థానిక పత్రికలకు మాత్రమే ఉందంటూ పాత్రికేయునిగా తన అనుభవాలను ఈ కార్యక్రమంలో తెలియజేశారు. ప్రభుత్వాలు ఏ పథకం ప్రవేశపెట్టినా, ఏ నిర్ణయం తీసుకున్నా వాటి వల్ల ఆ ప్రాంతానికి లేదా ఊరికి కలిగే ప్రయోజనాలు, సమస్యల గురించి స్థానిక పత్రికల ద్వారానే ఆ అక్కడి వారికి ప్రముఖంగా తెలుస్తుందన్నారు. స్థానిక సమస్యల పరిష్కారంలోను, స్థానిక ప్రజల ప్రయోజనాలకు పెద్ద పీట వేయడంలోను స్థానిక పత్రికలదే కీలక పాత్ర అని వల్లీశ్వర్ తేల్చి చెప్పారు.
సంఘ్ తెలంగాణ ప్రాంత ప్రచార ప్రముఖ్ రాజగోపాల్ మాట్లాడుతూ.. సమాచార భారతి సంస్థ ఆధ్వర్యంలోని విశ్వ సంవాద కేంద్ర (VSK) తెలంగాణ వెబ్ సైట్, లోకహితం జాగరణ పత్రిక, వీటి సోషల్ మీడియా ఖాతాలు, వాట్సాప్ చానెల్ ద్వారా జరుగుతున్న సమాచార సేవల గురించి స్థానిక పత్రికల సంపాదకులు, పాత్రికేయులకు వివరించారు.




## చెన్నాపూర్ చెరువును సందర్శించిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి

**జయభేరి, కీసర సర్కిల్ :**



దాదాపు 800 నుండి 1000 గణపతి మండపాలు ఏర్పాటయ్యే ఉమ్మడి జవహర్ నగర్ ప్రాంత పరిధిలో.. గణపతి నిమజ్జనం కొరకు మాత్రం చాలా వరకు కాప్రా చెరువు శామీర్ పేట్ చెరువుకు వెళ్లాల్సి వస్తుంది. కాగా స్థానికంగా చెన్నాపూర్ చెరువు ఉన్నప్పటికీ, అక్కడ కనీస ఏర్పాట్లు చేయకపోవడాన్ని ఉత్సవ సమితి నాయకులు తప్పు పట్టారు. అధికారులు ఈ విషయమై తక్షణం ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. గత ఐదారేండ్ల నుండి చెన్నాపూర్ చెరువును నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేయాలని కోరుతున్నా... అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసించారు. ఇప్పటికైనా చెన్నాపూర్ చెరువును నిమజ్జనం కోసం సి.సి రోడ్డు వేసి వీధి దీపాలు పెట్టించి, క్రేన్ సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలుమార్లు డిప్యూటీ కమిషనర్ కి విన్నవించిన విషయం గుర్తు చేస్తూ.. అధికారులు ఇప్పటికైనా చెరువును సందర్శించి లోతు ఎంత ఉందో ఎంత ఎత్తు విగ్రహాలు వేసుకోవచ్చో నిర్ణయిస్తే స్థానికులు అదే ఆదేశాల ప్రకారం నిమజ్జనం చేసుకుంటారని తెలియజేశారు.
చెన్నాపూర్ చెరువును నిమజ్జనం కోసం ఏర్పాటు చేయడం వల్ల కాప్రా రూట్లో ఇటు శామీర్ పేట్ రూట్లో ట్రాఫిక్ జామ్ తగ్గడమే కాదు, రోడ్ల సమస్యల వల్ల ఊరేగింపు వాహనాల్లో ఆసీనుడై ఉండే వినాయకుడి విగ్రహాలకు కూడా ఎటువంటి ఇబ్బందులు ఉండవు. తద్వారా లా అండ్ ఆర్డర్ సమస్యలు కూడా రాకుండా ఉంటుంది. దాదాపు రెండు నుండి మూడు లక్షల జనాభా ఉండే ఇక్కడి ప్రాంతంలో నిమజ్జనం అవకాశాలను ఎక్కడికక్కడే కల్పిస్తే ప్రశాంతంగా ఉత్సవాలు ముగుస్తాయని ఈ విషయంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు ఉత్సవ సమితి నాయకులు. ఈ కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ లు రాంబాబు దొంతమల్ల, అరుణ్ కుమార్ లతో పాటు ఉత్సవ సమితి నియోజకవర్గం సీనియర్ నాయకులు సంతోష్ గుప్త, రజినీకాంత్ గుప్త, మరియు కానుగంటి నరేందర్ సర్కార్, నవీన్, హరిబాబు గౌడ్, కో కన్వీనర్ లు శ్రీనివాస్, నాగరాజు, ఈశ్వర్, వీరేష్, అంజిబాబు, మాధవచారి, శ్రీనివాస చారి, వల్లాల సందీప్ తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ పార్టీలో ఉన్నానంటూనే.. కాంగ్రెస్ సభల్లో ఏంటి మీ పని?

- ఎవరిని మెప్పించడానికి ఎమ్మెల్యే గాంధీ ఈ ద్వంద్వ వైఖరి
- కాంగ్రెస్ ఏర్పాటు చేసిన ఓటరు నమోదు శిక్షణా సభలో పాల్గొనడంపై విమర్శలు
- స్వలాభం కోసం ప్రజలను మోసం చేస్తున్నారని బీఆర్ఎస్ నేత బొబ్బ నవతారెడ్డి మండిపాటు
- రానున్న రోజుల్లో శేరిలింగంపల్లి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరిక




**జయభేరి, శేరిలింగంపల్లి :**

తాను బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీలోనే ఉన్నానని పైకి చెబుతూ..ప్రతిపక్ష హోదా PAC చైర్మన్ పదవి అనుభవిస్తూ కాంగ్రెస్ పార్టీ నిర్వహించే అంతర్గత కార్యక్రమాల్లో శేరిలింగంపల్లి కాంగ్రెస్ నాయకుల తో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొనడం దారుణం అని బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్వలాభం కోసం ఆయన ఆడుతున్న ఈ అవకాశవాద రాజకీయ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే ఆయనకు తగిన బుద్ధి చెబుతారని ఆమె హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎమ్మెల్యే తీరుపై నిప్పులు చెరిగారు.

**ఎవరిని మెప్పించేందుకు ఈ నాటకాలు**

మియాపూర్ డివిజన్ పరిధిలోని నరేన్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు ఆ పార్టీ శ్రేణుల కోసం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2 కార్యక్రమాన్ని నిర్వహించారు.

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వి. జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యం లో కాంగ్రెస్ బీఎల్ఏలు, కార్యకర్తలకు ఓటరు నమోదుపై దిశానిర్దేశం చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ సభలో రాహుల్ గాంధీ,సోనియా గాంధీ,మీనాక్షి నటరాజన్,మహేష్ గౌడ్ ఫోటో లతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే గాంధీ పాల్గొనడంపై నవతా రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నేను ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నాను.. పార్టీ మారలేదని ,PAC పదవి అనుభవిస్తూ కూడా పదేపదే బీరాలు పోయే గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వేదికను పంచుకోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ఆమె నిలదీశారు. ఎవరిని మెప్పించ డం కోసం ఆయన ఈ డ్రామాలు ఆడుతున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**శేరిలింగంపల్లి ప్రజలను ఇంకా ఎన్ని రోజులు మభ్యపెట్టి, మోసం చేస్తారు**

ఎమ్మెల్యే గాంధీ తన ద్వంద్వ వైఖరితో శేరిలింగంపల్లి ప్రజలను తీవ్రంగా మభ్యపెడుతు,మోసం చేస్తున్నారు అని నవతారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని గుడ్డిగా సమర్థిస్తూ, ఆ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న వ్యక్తి.. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఓటు హక్కు మన హక్కు ఓటు రక్షణ మన బాధ్యత అంటూ కాంగ్రెస్ నాయకులు ఆ వేదికపై ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసాలు ఇవ్వడం, అదే వేదికపై.. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీకి కొమ్ముకాస్తున్న ఎమ్మెల్యే కూర్చోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ఆమె ఎద్దేవా చేశారు.

**ప్రజలు తగిన బుద్ధి చెబుతారు!**

పదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కోసమే అరెకపూడి గాంధీ ఇలాంటి ఊసరవెల్లి రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆమె విమర్శించారు. ఆయన రాజకీయ అవకాశవాదాన్ని, మోసకారి నైజాన్ని శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. అటు బీఆర్ఎస్ పార్టీని, ఇటు తనను నమ్మి ఓటేసిన నియోజకవర్గ ప్రజలను ఏకకాలంలో మోసం చేస్తున్న ఎమ్మెల్యే గాంధీగారు ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ లో చేరాను అని ఒప్పుకొని శేరిలింగంపల్లి ప్రజలకు క్షమాపణ చెప్పి,PAC పదవికి రాజీనామా చేయండి అని బొబ్బ నవత రెడ్డి డిమాండ్ చేశారు.



## యువత క్రీడల వైపు మరింతగా దృష్టి..

- బోడుప్పల్ సర్కిల్‌లో పలు కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బోడుప్పల్, చేంగిచెర్ల డివిజన్లలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభోత్సవాలు నిర్వహించారు. బోడుప్పల్ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వేవ్ సెలూన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, సెలూన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారం విజయవంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం చేంగిచెర్ల డివిజన్‌లో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ ప్రారంభోత్సవంలో పాల్గొని క్రీడలను ప్రారంభించారు. యువత క్రీడల వైపు మరింతగా దృష్టి సారించాలని, క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని అన్నారు. చివరగా బోడుప్పల్ డివిజన్‌లోని బొల్లిగూడెంలో నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తోటకూర అజయ్ యాదవ్, నూతన గృహ యజమానులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహంలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు పి. నర్సింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు పొగుల దిలీప్ రెడ్డి, బొమ్మక్ కళ్యాణ్, మాజీ కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత, నిర్వాహకులు, కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సమర్థవంతమైన నాయకుడిని డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నుకోండి

- ఎల్బీనగర్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు, ఎమ్మెల్సీ పీవీ మోహన్
- డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక కోసం మధుయాష్కి గౌడ్ ఆధ్వర్యంలో ఎల్ బీ నగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం.. హాజరైన పరిశీలకులు




**జయభేరి, ఎల్బీనగర్ :**

సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం రంగారెడ్డి జిల్లా నూతన డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియలో భాగంగా ఎల్బీనగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కర్మన్ ఘట్ లోని ఎన్ విలేజ్ కన్వెన్షన్ లో నిర్వహించడం జరిగింది.

ఏఐసీసీ పరిశీలకులు, కర్ణాటక ఎమ్మెల్సీ పీవీ మోహన్, ముఖ్యఅతిథిగా హాజరు కాగా.. జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ పరిశీలకులుగా టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ పీవీ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చల్లా నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీవీ మోహన్ మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లా దేశంలోనే ఆర్థికంగా నెంబర్ వన్ జిల్లా అన్నారు. దేశంలోనే ఫర్ క్యాప్టా అధికంగా ఉందని వివరించారు. అలాంటి రంగారెడ్డి జిల్లాకు సమర్థవంతమైన నేతను డీసీసీ అధ్యక్షులుగా ఎన్నుకోవాలన్నారు. ఓట్ చోరీ తోనే బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల్లో, పోలింగ్ ముగిసిన తర్వాత అనూహ్యంగా ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. ఎస్ఐఆర్ తో బీజేపీ లబ్ది పొందుతుందని, మన పార్టీ బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయడం చాలా ముఖ్యమన్నారు. అందుకే బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ బలపడాలి అంటే సమర్థవంతమైన డీసీసీ అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధాని చేసే లక్ష్యంగా పనిచేసే నాయకుడికి అవకాశం ఇవ్వాలని సూచించారు. మధుయాష్కి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే పార్టీని, కార్యకర్తలను మోసం చేసి, ఇతర పార్టీలోకి వెళ్ళినప్పటికీ.. మళ్లీ పార్టీని బలోపేతం చేయడంలో కార్యకర్తలు కృషి చేస్తున్నారన్నారు. ఎంపీగా రేవంత్ రెడ్డిని గెలిపించేందుకు ఎంతో శ్రమించారని వివరించారు. డీసీసీ అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి కార్యకర్తలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలియజేయాలని సూచించారు. తనకు రాజకీయ వారసులు ఎవరు లేరని, పార్టీ నాయకులు, కార్యకర్తలే తన వారసులని పేర్కొన్నారు. ఏఐసీసీ పరిశీలకులుగా వచ్చిన పీవీ మోహన్ కేరళలో ఇన్చార్జిగా పనిచేసి ఆ రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి రావడానికి సమర్థవంతంగా పనిచేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ లో భాగంగా 1,87,000 ఓట్లు నో మ్యాపింగ్ లో ఉన్నాయని, నోటీసులు అందుకునేవారు సంబంధిత వివరాలు అందజేసేలా ప్రతి కార్యకర్త, బీఎల్ఏలు పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు డీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన చల్లా నరసింహారెడ్డిని అభినందించి సన్మానించారు. డాక్టర్ మట్టా రాగమయి, పటేల్ రమేష్ రెడ్డి, శ్రీనివాస్ మాట్లాడుతూ.. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ, అందరినీ కలుపుకొని పోయి కష్టపడి పనిచేసే వారిని డీసీసీ అధ్యక్ష పదవికి ప్రతిపాదించాలని నాయకులకు సూచించారు. ఎవరైనా సరే పోటీలో ఉండొచ్చని, పదవి రాకపోయినా నిరుత్సాహపడకుండా మరింత కష్టపడి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



## అన్ని వర్గాల ఐక్యమత్యంతోనే రాజ్యాధికారం సాధ్యం

- ఐక్య ఉద్యమాలతో బీసీలు రాజకీయంగా ఎదగాలి

**డాక్టర్ కూరపాటి రమేష్**

**జయభేరి, తొర్రూర్, ఆగస్టు 30 :**



భారతదేశంలోనే 80 శాతానికి పైగా ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలు ఐక్యంగా ఉండి రాజ్యాధికారం సాధించాలని కూరపాటి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కురపాటి రమేష్ అన్నారు. ఆదివార తొర్రూరు లో జేఏసీ ఆహ్వాన కన్వీనర్ అనపురం వెంకన్న గౌడ్ అధ్యక్షతన, తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా వివిధ బీసీ సంఘాల ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు ఐక్య సమావేశ బీసీ దళపతి డాక్టర్ పరికిపండ్ల అశోక్ హాజరు కావడం జరిగినది. ఈ వేదిక బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో సబ్బండ కులాల ఐక్యవేదిక నాయకుల సహకారంతో ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి వివిధ మండలాల నుండి గ్రామాల నుండి వివిధ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ కుల సంఘ నాయకులందరూ పాల్గొన్నారు వచ్చే సెప్టెంబర్ నెలలో జరగబోయే బీసీ రాజ్యాధికార సంకల్ప సభను దిగ్విజయం చేయుట కొరకు సన్నాక సభను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ ప్రతి బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలందరూ 90 శాతం కలిగిన వారు ఒకే భావజాలాన్ని కలిగి ఉండి ఏకతాటిపై ఉండి నిర్మాణం చేసినట్లయితే భవిష్యత్తులో బీసీల బహుజనుల రాజ్యాధికారము సహకారం అవుతుందన్నారు. మనమెంతో మనకంత వాటాను భవిష్యత్తులో అన్ని స్థాయిలలో తీసుకునే అవకాశం ఉంటుందని వారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో, ప్రభుత్వ విద్యావ్యవస్థ లు, హాస్పిటల్స్ వైద్య రంగాలు సంక్షేమ రంగాలలో అసమానతలు అన్ని రకాలుగా నిర్వీర్యమైపోయాయని బడుగు బలహీన వర్గాల బహుజనులకు అందుబాటులో లేవని, పాలకుర్తి నియోజకవర్గం గత స్వాతంత్రం నుండి అగ్రవర్ణాల చేతిలోనే ఉండి వారి ఆధీనంలోనే అణచివేత ధోరణితో బిసి బహుజన్ లను ఎదగా నివ్వకుండా వారు చెప్పు చేతుల్లోనే ఉంచుకుంటూ అందర్నీ బానిసలుగా రాజకీయ చైతన్యం లేకుండా చేశారని వాపోయారు.ఈ కార్యక్రమంలో బండి పుల్లయ్య ఎక్స్ ఎమ్మెల్యే బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య చైర్మన్ బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా దామార ఉపేందర్ తెలంగాణ ఉద్యమకారుడు ప్రవీణ్ రాజ్. చామకూర్ ఐలయ్య, సిరి స్వచ్ఛంద సంస్థ శ్రీనివాస్, దళిత నాయకుడు అయిలయ్య, కోట వెంకటేశ్వర్లు, రాంపాక సుధాకర్, దొనకల్ ఐలయ్య, రాయిశెట్టి ఉపేందర్ లతోపాటు మండలాల నుండి బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## కార్యకర్తల అభిప్రాయం మేరకే పార్టీ నాయకుల ఎన్నిక




- ఒక్క కాంగ్రెస్ పార్టీలో మాత్రమే సాధ్యమన్న మల్‌రెడ్డి
- డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియలో భాగంగా అభిప్రాయ సేకరణ
- హాజరైన ఏఐసీసీ సెక్రటరీ పి.వి.మోహన్, ఇతర పరిశీలకులు

**జయభేరి, రంగారెడ్డి జిల్లా :**

కాంగ్రెస్‌కు కార్యకర్తలే వెన్నుముకలాంటివారని.. వారి అభిప్రాయం మేరకే పార్టీనాయకుల ఎంపిక జరుగుతుందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా (DCC) నూతన అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియలో భాగంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గస్థాయి సమావేశం కోహెడ సమీపంలో జరిగింది. స్థానిక శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి కర్ణాటక ఎమ్మెల్సీ మరియు AICC సెక్రటరీ పి.వి.మోహన్ తో పాటు పీసీసీ స్టేట్ జనరల్ సెక్రటరీ, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వి.శ్రీనివాస్ రావు పరిశీలకులుగా హాజరయ్యారు. ఇందులో భాగంగా నాయకులతో జరిగిన ముఖాముఖిలో జిల్లా అధ్యక్షుడి ఎంపిక అంశంపై అభిప్రాయసేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో మాత్రమే కార్యకర్తలు నేరుగా తమ అభిప్రాయాన్ని వ్యక్తపర్చే స్వేచ్ఛ ఉంటుందని చెప్పారు. ఇందులో భాగంగానే డీసీసీ అధ్యక్షుడి ఎంపికకు అభిప్రాయాల సేకరణ జరుగుతోందన్నారు. తొమ్మిదేళ్ల పాటు కార్యకర్తలు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారని, వారి అభిప్రాయాలను గౌరవించి, అన్ని విషయాల్లోనూ అధిష్ఠానం నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మల్‌రెడ్డి చెప్పారు. పలువిషయాల్లో క్షేత్రస్థాయిలో నెలకొన్న అసంతృప్తిని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని ఏఐసీసీ సెక్రటరీ మోహన్ గారిని మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. నాయకులు వ్యక్తపర్చిన అభప్రాయాన్ని పార్టీ దృష్టికి తీసుకువెళ్లి, నివేదిక అందిస్తామని పరిశీలకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఛైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ చేసిన సేవలు చిరస్మరణీయం

- పేద ప్రజల డాక్టర్‌గా ఎంతోమందికి సేవలందించారు
- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ డాక్టర్ నేనావత్ రాములు నాయక్ పేద ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని, పేద ప్రజల డాక్టర్‌గా ఆయన ఎంతోమందికి వైద్య సేవలు అందించారని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.ఆదివారం డాక్టర్ నేనావత్ రాములు నాయక్ ప్రథమ వర్ధంతి సందర్భంగా చందంపేట మండలం గన్నేర్లపల్లి గ్రామంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన డాక్టర్ రాములు నాయక్ విగ్రహాన్ని రమావత్ రవీంద్ర కుమార్ ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. డాక్టర్ రాములు నాయక్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. పేద ప్రజల పట్ల ప్రత్యేక శ్రద్ధతో వైద్య సేవలు అందిస్తూ, ఎంతోమందికి అండగా నిలిచారని కొనియాడారు. ఆపదలో ఉన్న వారికి వైద్యం అందిస్తూ ప్రజల మన్ననలు పొందిన ఆయనను ఎప్పటికీ ప్రజలు గుర్తుంచుకుంటారని అన్నారు. డాక్టర్ రాములు నాయక్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన అందించిన సేవలు, ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం, ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ పదిలంగా ఉంటాయని రవీంద్ర కుమార్ అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్,మండల పార్టీ అధ్యక్షులు TVN రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జార్పుల లోక్య నాయక్, వద్త్య దేవేందర్ నాయక్, కేతావత్ హరిలాల్, వద్త్య బాలు నాయక్, సర్పంచులు నేనావత్ భరత్, రమావత్ తులసీరాం, కౌన్సిలర్ అజయ్ చంద్ర, మాజీ కౌన్సిలర్ జయప్రకాశ్, నేనావత్ జైపాల్ నాయక్, నేనావత్ నాగార్జున నాయక్, కిషన్ నాయక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ట



**జయభేరి, నాగోల్ :**

వినాయక నగర్ కాలనీ వడ్డెర బస్తి లో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయం లో విగ్రహం ప్రతిష్ట బస్తి వాసులు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమములో ముఖ్య అతిధిగా బి ఆర్ ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు తూర్పటి చిరంజీవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతు అమ్మవారి చల్లని చూపు అందరి మీద ఉండాలని అమ్మవారిని వేడుకున్నాట్లు తెలిపారు ఈ కార్యక్రమం లో ఆలయం నిర్వహకులు నరహరి. యాదయ్య, రాఘవేంద్ర గౌడ్, సాలయ్య బాలయ్య, శివ తూర్పటి సతీష్ రవి తదితరులు పాల్గొన్నారు.



# వర్షాకాలంలో బట్టల దుర్వాసనతో ఇబ్బందా?

వర్షాకాలంలో దుస్తులు త్వరగా ఆరకపోవడం, వాటి నుంచి దుర్వాసన రావడం చాలా సాధారణం. తేమతో కూడిన వాతావరణం వల్ల ఈ సమస్య ఎదురవుతుంది. అయితే, కొన్ని సులభమైన చిట్కాలను పాటిస్తే, ఈ దుర్వాసనను సులభంగా దూరం చేసుకోవచ్చు. వర్షాకాలం వచ్చిందంటే చాలు, వాతావరణం చల్లగా, తేమగా మారుతుంది. ఈ సమయంలో దుస్తులు ఆరడానికి చాలా సమయం పడుతుంది.

మూడు, నాలుగు రోజులు గడిచినా బట్టలు తడిగా ఉండిపోవడం, వాటి నుంచి చెడు వాసన రావడం చాలామందికి ఎదురయ్యే సమస్య. ఎంత పెర్ఫ్యూమ్ కొట్టినా ఆ వాసన వదలదు, ఫలితంగా ఆ దుస్తులు ధరించడం కష్టంగా మారుతుంది.

**1. నిమ్మరసంతో దుర్వాసనకు చెక్:**

మీరు దుస్తులు ఉతికేటప్పుడు వాడే సర్ఫ్‌లో (డిటర్జెంట్‌లో) కొద్దిగా నిమ్మరసం కలపడం వల్ల దుర్వాసన రాకుండా ఉంటుంది. నిమ్మ రసంలో ఉండే విటమిన్ సి వాసనను తొలగించడమే కాకుండా, దుర్వాసనకు కారణమయ్యే బ్యాక్టీరియాను కూడా చంపుతుంది. ఇది దుస్తులకు సహజమైన సువాసనను అందిస్తుంది.

**2. బేకింగ్ సోడా:**

దుస్తులు ఉతికే డిటర్జెంట్‌లో బేకింగ్ సోడా కలపడం వల్ల కూడా మంచి ప్రయోజనాలు కలుగుతాయి. బేకింగ్ సోడా ఒక అద్భుత మైన వాసన నివారిణి. ఇది దుస్తులలోని చెడు వాసనలను గ్రహించి తొలగిస్తుంది. అలాగే, ఉతికిన తర్వాత దుస్తులకు మంచి సువాసన కోసం కంఫర్ట్ వంటి ఫ్యాబ్రిక్ సాఫ్టెనర్‌లను ఉపయోగించడం వల్ల కూడా మంచి ఫలితాలు ఉంటాయి.

**3. కర్పూరం బిళ్ళతో సువాసన:**

వర్షాకాలంలో దుస్తుల నుంచి దుర్వాసనను పోగొట్టడానికి కర్పూరం బిళ్ళలు కూడా చాలా ఉపయోగపడతాయి. దుస్తులు ఆరిన తర్వాత లేదా వాటిని అలమరాలో భద్రపరిచేటప్పుడు, కొన్ని కర్పూరం బిళ్ళలను దుస్తుల మధ్య ఉంచండి. కర్పూరం సహజంగా సువాసనను వెదజల్లి, దుస్తులకు తాజాగా ఉండేలా చేస్తుంది. ఇది తేమను కూడా కొంతవరకు గ్రహిస్తుంది.

**4. వాషింగ్ మెషిన్, డ్రైయర్ వాడకం:**

ఈ రోజుల్లో చాలామంది వాషింగ్ మెషిన్, డ్రైయర్లను ఉపయోగిస్తు న్నారు. ఇవి దుస్తులను త్వరగా ఆరబెట్టడంలో సహాయపడతాయి. అయితే, కొన్నిసార్లు డ్రైయర్ వాడినా కూడా తేమ వల్ల దుర్వాసన రావొచ్చు. పైన చెప్పిన చిట్కాలు వాషింగ్ మెషిన్‌లో ఉతికిన దు స్తులకు కూడా వర్తిస్తాయి. డ్రైయర్‌లో ఆరబెట్టిన తర్వాత కూడా తేలికపాటి దుర్వాసన అనిపిస్తే, ఈ నిమ్మరసం, బేకింగ్ సోడా లేదా కర్పూరం చిట్కాలను పాటించవచ్చు. ఈ చిన్న చిన్న చిట్కాలను పాటించడం ద్వారా వర్షాకాలంలో మీ దుస్తులు తాజాగా, సువాస నభరితంగా ఉండేలా చూసుకోవచ్చు.



# పండ్లను కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

పండ్లు మన ఆరోగ్యానికి ఎంత మంచివో మనందరికీ తెలుసు. డాక్టర్లు సైతం ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని చెబుతారు. కానీ చాలా మంది పండ్లను కోసి కొన్ని గంటల తర్వాత తింటారు. అయితే కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే అది మన శరీరం పై చెడు ప్రభావాన్ని చూపుతుంది.


పండ్లు మన శరీరానికి మంచివని అందరికీ తెలుసు. ప్రతిరోజ పండ్లను తినడం ఆరోగ్యానికి మంచిది. విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెం ట్లు, ఫైబర్ వంటివి పండ్లలో సమృద్ధిగా ఉంటాయి. పండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని వైద్యులు సూచిస్తారు. కొన్నిసార్లు మనం పండ్లను కోసి అలాగే ఉంచుతాం. ఆఫీసులు, ఏదైన ప్రయాణ సమయా ల్లో కోసి తీసుకెళ్తుంటారు. కొంతమంది కోసి ఫ్రిజ్‌లో పెడతారు. కొన్ని గంటల తర్వాత వాటిని తింటారు. కానీ కోసిన పండ్లను ఎంతసేపట్లో తినాలి..? అవి ఎంతకాలం మంచిగా ఉంటాయి అనేది చాలా మందికి తెలియదు. ఇవి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

**పండ్లు తినడానికి సరైన సమయం ఏమిటి?**

పండ్లను ఏ సమయంలో తిన్న మంచిదేనని నిపుణులు అంటున్నా రు. అయితే కొన్నింటిని ఉదయం ఖాళీ కడుపుతో, మరికొన్నింటి ని రాత్రి వేళలో తినకూడదని చెబుతారు. ఏదైనా సరే మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని అంటున్నారు.

**కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?**

కోసిన వెంటనే పండ్లు చెడిపోవు. కానీ వాటిని ఎంత త్వరగా తింటే అంత మంచిది. నిజానికి కోసిన పండ్లలో ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరు గుతుంది. వేసవి, వర్షాకాలం సూక్ష్మజీవుల పెరుగుదలకు ఉత్తమ సమయాలు. ఈ సీజన్లలో కోసిన పండ్ల వల్ల ఇన్ఫెక్షన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఎక్కువసేపు నిల్వ చేయకుండా వీలైనంత త్వరగా వాటిని తినాలి. పండ్ల నుండి అన్ని పోషకాలను పొందడానికి వాటిని కోసిన అరగంటలోపు తినడం ఎల్లప్పుడూ మంచిదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.



# మహిళలు.. ఈ వ్యాయామాలతో పీరియడ్స్ నొప్పి దూరం..

ఋతుక్రమ నొప్పి నుండి ఉపశమనం పొందడానికి సున్నితమైన వ్యాయామం గొప్ప మార్గం. కొన్ని ప్రభావవంతమైన వ్యాయామాలలో పెల్విక్ టిల్ట్‌లు, నడుము, గ్లూట్ స్ట్రెచింగ్‌లు, పిల్లల భం గిమ వంటి యోగా భం గిమలు ఉన్నాయి. నడక, ఈత, తేలికపాటి కార్డియో కూడా రక్త ప్రసరణను మెరుగుపరచడం, సహజ నొప్పి నివారణ మందులుగా పనిచేసే ఎండార్ఫిన్‌లను విడుదల చేయడం ద్వారా సహాయపడతాయి.

**పెల్విక్ టిల్ట్స్ :**

మీ మోకాళ్లను వంచి, పాదాలను నేలపై ఉంచి మీ వీపు మీద పడుకోండి. మీ పొత్తికడుపు కండరాలను నిమగ్నం చేస్తూ, మీ పెల్విస్‌ను మెల్లగా పైకి వంచండి. కొన్ని సెకన్ల పాటు అలాగే ఉండి, ఆపై విశ్రాంతి తీసుకోండి. దీన్ని 1015 సార్లు పునరావృతం చేయండి. ఇలా చేస్తే ఋతుక్రమ నొప్పి నుంచి బయటపడవచ్చు.

**నడుము కింది భాగం, గ్లూట్ స్ట్రెచ్:**

మీ కుడి పాదాన్ని ముందుకు, ఎడమ పాదాన్ని వెనుకకు ఉంచి, మడమను పైకి లేపి ప్రారంభించండి. మీ ముందు మోకాలిని వంచి, మీ చేతులను తలపైకి చాచండి. సాగదీసేటప్పుడు మీ తుంటిని కుడి వైపుకు బయటికి కదిలించండి. దీనివల్ల పీరియడ్ పెయిన్ దూరం అవుతుంది.

**పిల్లల భంగిమ:**

నేలపై మోకరిల్లి మీ మడమల మీద తిరిగి కూర్చోండి. ముందుకు వంగి, మీ మొండెంను మీ తొడల మధ్య ఉంచండి. మీ చేతులను ముందుకు చాచండి లేదా వాటిని మీ వైపులా విశ్రాంతి తీసుకోండి. ఈ భంగిమను కొన్ని నిమిషాలు పట్టుకోండి. ఈ భంగిమ ద్వారా ఋతుక్రమ నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

**ఇతర ఉపయోగకరమైన వ్యాయామాలు:**

సున్నితమైన యోగా భంగిమలు కండరాలను సడలించడానికి మరియు ఉద్రిక్తతను తగ్గించడానికి సహాయపడతాయి. చురుకైన నడక రక్త ప్రస రణను మెరుగుపరుస్తుంది మరియు నొప్పిని తగ్గిస్తుంది. నీటిలో ఈత సామర్థ్యం మద్దతు, సున్నితమైన వ్యాయామాన్ని అందిస్తుంది. కొన్ని పైలేట్స్ వ్యాయామాలు కోర్ కండరాలను బలోపేతం చేస్తాయి మరియు భంగిమను మెరుగుపరుస్తాయి.

**ముఖ్యమైన విషయాలు:**

ఏదైనా వ్యాయామం నొప్పిని కలిగిస్తే, ఆగి విశ్రాంతి తీసుకోండి. భారీ వ్యాయామాలు కొన్నిసార్లు తిమ్మిరిని మరింత తీవ్రతరం చేస్తాయి. పుష్క లంగా నీరు త్రాగడం వల్ల కండరాల తిమ్మిరిని నివారించవచ్చు. హీటింగ్ ప్యాడ్ వేయడం లేదా వెచ్చని స్నానం చేయడం కూడా ఉపశమనం కలి గిస్తుంది.



